క్లుప్తంగా

కమిషనర్ రాజు బాధ్యతల స్వీకరణ



కమిషనర్ రాజుకు అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

రామచంద్రపురం: కొత్త మున్సిపల్ కమిషనర్‌గా కేవీఆర్‌ఆర్ రాజు గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన నాయుడు విశాఖకు బదిలీపై వెళ్లారు. కాగా అమలాపురం నుంచి రాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనను మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

హెచ్‌ఐవీ రోగులను ఆదరించాలి



వల్లూరులో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కపిలేశ్వరపురం: హెచ్‌ఐవీని ఆరోగ్య సమస్యగా మాత్రమే చూడాలని, వ్యాధి బారినపడిన వారిని సామాజిక స్పృహతో ఆదరించాలంటూ గురువారం వల్లూరు గ్రామంలో కళారూపాలను ప్రదర్శించారు. గొల్లపూడికి చెందిన రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ వాధిపై వీధినాటికను ప్రదర్శించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాపించే విషయాలపై ప్రజల్లో అనుమానాలను తొలగిస్తూ ప్రదర్శించిన నాటిక విశేషంగా ఆకట్టుకుంది. కళాకారులు ఎం.ప్రేమానందం, వై.రాజేశ్వరి, జి.బాబూరావు, వి.రాంప్రసాద్, శీలం వెంకటేశ్వరరావు పాడిన గీతాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమాన్ని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రి సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షించారు.

రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు అనుమతులు



ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరం, జెడ్.మేడపాడు గ్రామాల పరిధిలోని రైల్వే ట్రాక్‌ల వద్ద రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం అనుమతులను మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వెల్లడించారు. తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. అనుమతులకు కృషి చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ ఏడాది నవంబర్‌లోపు కేశవరం బ్రిడ్జి నిర్మాణానికి 6.53 ఎకరాలు, జెడ్ మేడపాడు నిర్మాణానికి 5.72 ఎకరాల స్థలాన్ని సేకరించి కేంద్రానికి అప్పగించే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. అది పూర్తి కాగానే బ్రిడ్జి నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. సమావేశంలో మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మందపల్లి దొరబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బాబా జీవిత చరిత్ర, మహిమలపై బాబా భక్తభజన బృందం సభ్యులు కీర్తనలు ఆలపించారు. మందిర నిర్వాహకులు బాబాను విశేషంగా అలంకరించారు. హారతి కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



శ్రీరామ్‌నగర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న సూర్యప్రకాశ్

కాజులూరు: మనిషికి ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, సమస్యలు దూరమవుతాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. కాజులూరు శివారు శ్రీరామ్‌నగర్‌లో జరిగిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత ఆలయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు. దీంతో గ్రామస్తులు ప్రజా విరాళం రూ.50 లక్షలతో సమీపంలో మరో ఆలయాన్ని నిర్మించి, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారిని సూర్యప్రకాశ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గ్రామ ముఖద్వారం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి, నాయకులు యాళ్ల సత్తిబాబు, పోతు శ్రీనివాస్, పలువురు గ్రామ పెద్దలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.

పల్లెకు వెలుగేది..?

- గ్రామాలకు చేరని ఆర్టీసీ బస్సులు
- గ్రామీణ బస్టాండ్లకు భద్రత కరవు
- సైకిల్‌స్టాండ్లుగా మిగులుతున్న వైనం



మసకపల్లి నుంచి కె.గంగవరం వస్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు

కె.గంగవరం: ప్రస్తుతం పల్లె వెలుగు గ్రామాలకు వెళ్లడం లేదు. ఎప్పుడూ ఒకే రూట్లో బస్సులు ప్రయాణించడమే కానీ మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకుండా పోయింది. మారుమూల గ్రామం నుంచి ఏదైనా పని మీద రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటేనే గ్రామీణ ప్రాంత ప్రజలు నరకయాతన పడుతున్నారు. నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో నరజాడ, కూళ్లమల్లవరం, ఊడిమూడి, పాతకోట, కొత్తకోట, సుందరపల్లి, వట్రపూడి, నెలపర్తిపాడు, తాడిగొయ్య, భట్లపాలిక పరిధిలోని దరువుపేట తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. కాజులూరు మండలంలో మూడు గ్రామాలకు మినహా సుమారు 15 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గతంలో మంజేరు–కాకినాడ, దుగ్గుదూరు–కాకినాడ, నామవారిపాలెం–కాకినాడ, మతుకుమిల్లి–కాకినాడ, అంద్రండి–కాకినాడ, తణుకువాడ–కాకినాడ సర్వీసులను నడిపేవారు. రద్దీ లేదనే నెపంతో ప్రస్తుతం ఆయా సర్వీసులు రద్దు చేశారు. రామచంద్రపురం మండలంలోని వెల్ల, కాపవరం, యనమదల, భీమక్రోసుపాలెం, ఆదివారపుపేట, బాపనయ్య చెరువు తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో పాటు శివారు గ్రామాలకు వెళ్లే అరకొర బస్సులు కూడా గ్రామ సరిహద్దు నుంచి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యాలు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు జేబులు గుల్ల చేసుకుని ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు కూడా బస్సు సర్వీసులు వేయాలని, దీంతో పాటు రద్దు చేసిన రూట్లో కూడా సర్వీసులు పునరుద్ధరించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుపయోగంగా బస్టాండ్లు

గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాండ్లు ప్రస్తుతం నిరుపయోగంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా నిలుస్తున్నాయి. దాదాపుగా 60 శాతం గ్రామాల్లో బస్సులు ఊరి చివరి నుంచి పట్టణాలకు వెళుతున్నాయి. దీంతో ఊరి చివరి ప్రధాన రహదారికి చేర్చి గతంలో విశ్రాంతి భవనాలను నిర్మించారు. ఇప్పుడవి సైకిల్ స్టాండ్లుగా, పగలు జూదాలకు నిలయాలుగా, రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా నిలుస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాండ్లకు భద్రత కల్పించాలని, అన్ని రూట్లలోపు బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

సమయం వృథా అవుతుంది



రోజుకు అరకొరగా బస్సు సౌకర్యాలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, వ్యాన్లు, ఇతర ప్రైవేటు వాహనాలు ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో డబ్బు, సమయం వృథా అవుతుంది.

– రాయుడు జగన్, ప్రయాణికుడు

భద్రత కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాండ్లకు భద్రత కల్పించాలి. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో బస్టాండ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా ఉంటున్నాయి. కనీసం ఆయా గ్రామాల్లో ఉన్న బస్టాండ్లను పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

– మేడిశెట్టి రాంబాబు, యర్రపోతవరం

కేబుల్ ఆపరేటర్లకు రుణాలు ఇవ్వాలి

కపిలేశ్వరపురం: సాంకేతిక పరికరాల కొనుగోలు కోసం కేబుల్ ఆపరేటర్లకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని ఏపీ ఫైబర్ కేబుల్ ఆపరేటర్లు కోరారు. గురువారం అంగర, టేకి, పడమర ఖండ్రిక తదితర గ్రామాల కేబుల్ ఆపరేటర్లు ఎం.వెంకటరమణ, నరసింహమూర్తి తదితరులు ఇక్కడ మాట్లాడుతూ, కాలం చెల్లిన ఎస్‌టీబీ బాక్సులకు సైతం తమ వద్ద రెంటల్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం నుంచి ముమ్మిడివరం, కొత్తపేట ఉపకేంద్రాలకు వెళ్లే 132 కేవీ డబుల్ సర్క్యూట్ లైన్‌లో పాడైన టవర్లను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వెంకన్న రథశాలకు శంకుస్థాపన

కొత్తపేట: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి రథశాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. రూ. 38 లక్షలతో నిర్మించనున్న రథశాలకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు.

పెన్షనర్లకు ఫారం-16 జారీ

అమలాపురం టౌన్: గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం నుంచి ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు పొందిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్లకు ఫారం –16 జారీ చేసినట్లు అమలాపురం సబ్ ట్రెజరీ అధికారి రంగారావు తెలిపారు. ఇదే సమాచారాన్ని ఆయన జిల్లా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు తెలియజేశారు. ఇలా ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు పొందిన పెన్షనర్లు ట్రెజరీ కార్యాలయం పనివేళల్లో ఫారం –16ను తీసుకోవచ్చని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు సూచించారు.

మా పొట్ట కొట్టొద్దు

తహసీల్దార్‌కు ఎండీయూ డ్రైవర్ల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ డ్రైవర్లు, హెల్పర్లు

రాయవరం: రేషన్ సరకులు తరలించే ఎండీయూ వాహన డ్రైవర్ల పొట్టకొట్టవద్దంటూ ఆ డ్రైవర్ల సంఘ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఐపీ శెట్టికి మండలంలోని ఎండీయూ వాహన డ్రైవర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. సంఘ మండల అధ్యక్షుడు రాయుడు నాగమురళి మాట్లాడుతూ, రేషన్ సరకులు ఇంటింటికీ తరలించేందుకు గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో 9,260 మంది డ్రైవర్లకు 9,260 మంది హెల్పర్లకు ఉపాధి లభించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ఆకస్మికంగా తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం వలన 18,520 మంది ఎండీయూ డ్రైవర్లు, హెల్పర్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యనమదల శ్రీనివాస్, మణికంఠ, అశోక్, కిశోర్, వాసు, వీర్రాఘవరెడ్డి, నాగేష్, విజయ్, మోర్త ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలను మరింత మెరుగుపర్చాలి

ఆర్డీఓ అఖిల



అంగర ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలు అత్యధికంగా ఆశ్రయించే అంగర పీహెచ్‌సీలో వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలని రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ డివిజనల్ అధికారి నక్కా ప్రశాంతితో కలిసి గురువారం ఆస్పత్రిని ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సదుపాయాలు, వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. రికార్డులు, మందుల నిల్వలు, సిబ్బంది విధులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి, సిబ్బందితో సమావేశమై, వైద్యారోగ్య విధులకు సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాలను వివరించారు. ఆమె వెంట వైద్యారోగ్య శాఖ డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమలశేషు, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, స్టాఫ్ నర్స్ బంగారు పాప, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ అలీ ఉన్నారు.

ఇంటి వద్దకే రేషన్ నిలిపివేయడం ఓర్వలేనితనమే..

అమలాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజా రంజకంగా ప్రారంభించిన ఇంటి వద్దకే రేషన్ సరకుల పంపిణీ విధానాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిలిపివేయడం ఓర్వలేని తనమేనని పార్టీ జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి బారులు తీరి నిరీక్షించే దుస్థితికి చరమ గీతం పాడి ఇంటింటికీ రేషన్‌ను అందించే వాహనం (ఎండీయూ) వ్యవస్థను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని గుర్తు చేశారు. ప్రజాదారణ పొందిన ఈ విధానాన్ని చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎండియూ వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఇప్పటికే ప్రజాదారణ పొందిన ఈ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

ప్రజలతో మమేకం కావడమే లక్ష్యం



కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజలకు మేలు చేయడంలో ఏడాది కూటమి పాలన పూర్తిగా విఫలమైందని, అష్టకష్టాలతో సతమతమవుతున్న ప్రజలతో మమేకం కావడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, నియోజకవర్గంలోని మండలం, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి బాధితులుగా మారారన్నారు. ప్రభుత్వమనేది ఏదైనా సంక్షేమం, అభివృద్ధి, విద్యా, ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేయాలని, కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. ఎన్నికల సయమంలో టీడీపీ, జనసేన, బీజేపీ అగ్రనేతలు ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలయ్యాయన్నారు. తొలుత వలంటీర్లు, ఇ ప్పుడు ఎండీయూ ఆపరేటర్లు పనిని కోల్పోయారన్నారు. ఏడాది కాలంలో ఒక్క రేషన్ కార్డును కూడా ఇచ్చి న దాఖలాలు లేవన్నారు. ప్రతి పథకాన్నీ కాలయాపన తో పాలన సాగించడంతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజ లకు తోడుగా నిలవాలని ఎమ్మెల్సీ తోట నిర్దేశించారు.

ముత్యాలమ్మకు వెండి కిరీటం సమర్పణ



ముంగండలో ముత్యాలమ్మ వారికి వెండి కిరీటం సమర్పించిన దాతలు

పి.గన్నవరం: ముంగండలో వేంచేసిన ముత్యాలమ్మ వారికి గ్రామానికి చెందిన సాదా కృష్ణ దంపతులు కిలో వెండితో చేయించిన కిరీటాన్ని గురువారం అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలైన కృష్ణ దంపతులను అభినందించారు.

బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



వేగాయమ్మపేటలో బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ మండలంలోని వేగాయమ్మపేటలో మంజూరు చేసిన రూ.25 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాలుకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి తుకారం, ఎంపీపీ అంబటి భవాని, నెహ్రూ దంపతులు, నాయకులు మేకా జానకిరామయ్య, కాశా సత్యనారాయణ, కుడుపూడి లక్ష్మణరావు, కొమరిన బాబీ, గారపాటి జోగారావు, శెట్టిబలిజ సంఘ పెద్దలు కుడుపూడి పెద్దరాముడు, టేకుమూడి త్రిమూర్తులు, కడియాల గోవిందు, పితాని సూరిబాబు పాల్గొన్నారు.

25న బహుజన సంకల్ప సభ



శలపాకలో కరపత్రాలు పంచుతున్న నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: రామచంద్రపురం పట్టణంలో ఈ నెల 25న మధ్యాహ్నం బహుజన సంకల్ప సభను నిర్వహిస్తున్నట్టు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయనతో పాటు, బీవీఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి బుల్లిరాజు తదితరులు పర్యటించి, సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శలపాకలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలోనూ సంకల్ప సభలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు పార్టీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముడుకు రాంజీ, ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు, నాయకులు నాగేశ్వరరావు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



శ్యామలకు సాయం అందిస్తున్న సహదేవ్ తదితరులు

సఖినేటిపల్లి: భర్త వియోగంతో బాధపడుతున్న భార్యకు అతడి స్నేహితులు కొండంత అండగా నిలిచారు. ఆమెకు గురువారం ఆర్థికసాయం కూడా అందజేశారు. మండలంలోని రామేశ్వరానికి చెందిన మత్తి రవికుమార్ కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అతడి భార్య మత్తి శ్యామల ఇద్దరు సంతానాన్ని పోషించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకుని స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల పదో తరగతి 2003 బ్యాచ్‌కు చెందిన రవికుమార్ స్నేహితులు వీరిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. స్నేహితులంతా కలసి మొత్తం రూ.50 వేలు సమకూర్చారు. ఇద్దరు పిల్లల పేరున రూ.20 వేల చొప్పున పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను, కుటుంబ ఖర్చులకు రూ.10 వేలను హ్యూమానిటీ హార్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధి తాడి సహదేవ్ చేతుల మీదుగా శ్యామలకు అందజేశారు.


పవనపుత్రా.. పాహిమాం



వెదురుపాకలో భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు



మొగలిపాలెంలో అన్న సమారాధన నిర్వహిస్తున్న భక్తులు



ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయ స్వామివారి ఊరేగింపు



పడమర ఖండ్రికలో భక్తి గీతాలాపన నిర్వహిస్తున్న కళాకారులు



రాయవరంలో విశేషాలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

రాయవరం: పవనపుత్రా పాహిమాం.. వాయుపుత్రా రక్షమాం.. అంటూ భక్తుల మారుతి నామస్మరణతో గురువారం ఆంజనేయస్వామి ఆలయాలు మార్మోగాయి. మండలంలోని పలు ఆలయాల్లో భక్తాంజనేయస్వామి జయంతి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. రాయవరంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు కూర్మెళ్ల సూర్యనారాయణమూర్తి, శివ ఆధ్వర్యంలో నాగవల్లీ దళాలతో అర్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సింధూరపూజ, లక్ష తులసి దళ అర్చన, హనుమత్ హోమం, పూర్ణాహుతి, అదేవిధంగా మాన్య సూక్త హోమాన్ని నిర్వహించారు. రాయవరం–వెదురుపాక రహదారిలో వి.సావరం సెంటర్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి అర్చకులు గోడిపూడి త్రినాథశర్మ అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లొల్ల, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ప్రత్యేక అభిషేకాలు, పూజలు

కాజులూరు: మండలంలోని వివిధ గ్రామాలలో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గొల్లపాలెం, ఆర్యావటం, కాజులూరు, మొగలిపాలెం, శీల, మంజేరు, దుగ్గుదుర్రు, కుయ్యేరు, కోలంక, పల్లిపాలెం, జగన్నాథగిరి, అయితపూడి తదితర గ్రామాలలో జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని పురోహితులు స్వామివారిని సుంగధ ద్రవ్యాలతో అభిషేకించి, సిందూరం పూసి, ఆభరణాలతో అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గొల్లపాలెంలోని కాకినాడ–కోటిపల్లి రహదారిలో ఉన్న దాసాంజనేయస్వామివారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పెదింటి కృష్ణమోహనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తమలపాకులు, మామిడి పండ్లతో అభిషేకించి, పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో జయంతి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్న సమారాధన జరిగాయి. సాయంత్రం ఉష్ట్ర వాహనంపై ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో స్వామివారి ఊరేగింపు మేళతాళాలతో నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వెల్ల, దాసరిపాడు, గొల్లలచెరువు, నరసాపురపుపేట తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణలు చేశారు.

విశేష పూజలు

కపిలేశ్వరపురం: ఆంజనేయస్వామికి మండపేట నియోజకవర్గంలో విశేష పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో స్వామి విగ్రహాలను విశేషంగా అలంకరించారు. పడమర ఖండ్రిక బొమ్మల రామాలయంలో ఏకాహ ఉత్సవం ప్రారంభించారు. ఈ నెల 28 వరకూ కొనసాగే ఈ కార్యక్రమంలో భక్త భజన బృందం సభ్యులు భక్తిగీతాలను ఆలపిస్తారు. పెద్ద కోరుమిల్లి, చిన్న కోరుమిల్లి గ్రామాల్లోని భారీ విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తాతపూడి, అంగర, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో జయంతి పూజలు ఘనంగా నిర్వహించారు.

మండపేటలో..

పట్టణంలోని రథం సెంటర్, బురుగుంట చెరువు వద్ద ఉన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహాల వద్ద జయంతి పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సినిమా రహదారిలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి లక్ష గంధ సిందూర, తమలపాకుల పూజలు చేశారు. జెడ్ మేడపాడు, ఇప్పనపాడు గ్రామాల్లో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పూజలు చేశారు. మారేడుబాక, ఏడిద, ఏడిద సీతానగరం, పాలతోడు, తాపేశ్వరం, వెలగతోడు, ద్వారపూడి, కేశవరం, మెర్నిపాడు గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు.